క్లుప్తంగా

ఇంటర్న్‌షిప్‌కు అవకాశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. అర్హులైన వారు దరఖాస్తులను https://pminternship.mca.gov.in/ login వెబ్‌సైట్ ద్వారా అందజేయవచ్చు. వివరాలకు కరీముల్లా (83413 66022), రఫీ (94906 22810)ను సంప్రదించవచ్చు.

అత్యుత్తమ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్

దేశంలోనే అత్యుత్తమంగా ఖ్యాతి గాంచిన 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పిస్తారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన వారికి స్టైఫండ్ కింద నెలకు రూ.5 వేలు చెల్లిస్తారు. ఇందులో రూ.4,500ను కేంద్ర ప్రభుత్వం, రూ.500ను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కంపెనీ భరిస్తాయి. అలాగే వన్-టైమ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ కింద కేంద్ర ప్రభుత్వం నేరుగా రూ.6 వేలను ఒకేసారి చెల్లిస్తుంది. ప్రధాన మంత్రి బీమా యోజన, ప్రధాన మంత్రి ప్రమాద బీమా యోజన కింద పరిరక్షణ కల్పిస్తారు. 18 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, బీబీఏ, బీఫార్మసీ, పూర్తి చేసిన వారు, చివరి సెమిస్టర్‌లో చదువుతున్నవారు అర్హులు.

విశ్రాంత ఉద్యోగికి సన్మానం



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: 'నీవు క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావు. నిన్ను తప్పించాలంటే రూ.30 లక్షలు ఇవ్వాలి' అంటూ సైబర్ నేరగాడు చేసిన ఫోన్ కాల్‌పై వెంటనే స్పందించకుండా అప్రమత్తం చేసిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి నారాయణరెడ్డిని పోలీసులు ఘనంగా సత్కరించారు. వివరాలు... అనంతపురానికి చెందిన నారాయణరెడ్డి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ పదవీవిరమణ పొందారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా ఆయనకు సైబర్ నేరగాడు ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తూ వచ్చాడు. బెదిరింపులకు తొలుత తలొగ్గక పోయినా... ఆ తర్వాత అనుమానం వచ్చిన ఆయన వెంటనే సైబర్ విభాగాన్ని సంప్రదించాడు. స్పందించిన సైబర్ పోలీసులు ఆయనను టూటౌన్ సీఐ శ్రీకాంత్ వద్దకు పిలుచుకెళ్లారు. అదే సమయంలో సైబర్ నేరగాడు మరోసారి ఫోన్ చేయడంతో ఆ కాల్‌ను సీఐ స్వీకరించి, మాట్లాడారు. సారాంశం మొత్తం విన్న తర్వాత 'నీవు సైబర్ నేరగాడివని తెలుసు. ప్రజలను ఇలా ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరంగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం' అంటూ సీఐ తనదైన శైలిలో మాట్లాడడంతో వెనువెంటనే అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. సైబర్ నేరగాడి పన్నాగాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న నారాయణరెడ్డిని అభినందిస్తూ పోలీసులు ఘనంగా సన్మానించారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



ఆర్‌ఎఫ్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్‌లో నిలబడిన భక్తులు



ఆత్మకూరు: మలహోబిల లక్ష్మీనారసింహుడికి పూజలు



రాప్తాడులో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



పూజలందుకున్న రాంనగర్ వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: పవిత్ర ధనుర్మాసంలో వచ్చిన ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరం జన సంద్రంగా మారింది. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసుడు విశేష పూజలందుకున్నాడు. అర్ధరాత్రి నుంచే భక్తులు క్యూలైన్లలో నిలబడి శ్రీవారిని దర్శించుకున్నారు. గోవింద నామస్మరణతో నగరం మార్మోగింది. పలు చోట్ల మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఇతర కార్పొరేటర్లు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే కలెక్టర్ వినోద్ కుమార్, ఆర్డీఓ కేశవ నాయుడు క్యూలైన్లను పర్యవేక్షించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పాతూరులో కొలువైన ప్రాచీన చెన్న కేశవస్వామి ఆలయంలో ముక్కోటి పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు అర్ధరాత్రి నుంచే లైన్లలో నిలబడి శ్రీవారిని దర్శించుకున్నారు. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. ఉదయం 4 గంటల్లోపే స్వామికి అలంకార సేవతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజల్లో అధ్యక్షుడు వెంకటరమణా రెడ్డి, కొండయ్య, ఫ్లెక్స్ రమణ, నాగరాజు, ఎన్వీ రావు, గుప్తా తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాంనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పెద్దిరెడ్డి, శేషాంజనేయులు, ఆదిశేషయ్య, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. కమిటీ ప్రతినిధులు కేశవచంద్ర రావు, ప్రతాపరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, చెన్నారెడ్డి, లక్ష్మీనరసప్ప, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు. శివబాలయోగి ఆశ్రమంలో నిలువెత్తు శ్రీనివాసుడు ప్రత్యేక అలంకారసేవలో పూజలందుకున్నాడు. అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రెవెన్యూ కాలనీలోని కోదండ రామాలయంలో అఖండ విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలోని గోశాలలో గోవిందుడికి, రామానగర్ రామాలయం, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖర బాబు నేతృత్వంలో పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంపనూరులోని మలహోబుల లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆత్మకూరులోని వాసవీ మాతను వేంకటేశ్వర స్వామిగా అలంకరించి, పూజలు చేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రాప్తాడు: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వారాలు తెరవడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. రాప్తాడులో పండమేటి రాయుడు, ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్నయనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హంపాపురంలోని మౌనగిరి క్షేత్రంలోని 39 అడుగుల ఆంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామికి మౌనగిరి వ్యవస్థాపకులు ఈశ్వరయ్య స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలి

- హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వ కుట్ర
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

అనంతపురం కార్పొరేషన్: తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ డిమాండ్ చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో టోకన్ కోసం వెళ్లి ఆరుగురు మృత్యువాత పడితే టీటీడీ చైర్మన్ నాయుడు ఇది దైవ నిర్ణయమంటూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కలియుగ ప్రత్యక్ష దైవంపై మోపడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే వేంకటేశ్వరస్వామిపై ఎఫ్ఐఆర్ కట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందన్నారు. ప్రభుత్వం, పాలకమండలి, టీటీడీ అధికారుల నిర్లక్ష్యంపై మాట్లాడకుండా దేవుడిపై నెపం వేయడం సబబు కాదన్నారు. అలాగే ఇందులో గత ప్రభుత్వ నిర్లక్ష్యం, కుట్ర దాగి ఉందంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చౌకబారు రాజకీయాలు చేయడం సిగ్గు చేటన్నారు. గోదావరి పుష్కరాల్లో 29 మందిని, కందుకూరులో 8 మందిని, గుంటూరులో 3, రాజమండ్రిలో 2, యువగళంలో తారకరత్నను, తాజాగా తిరుపతిలో ఆరుగురిని పొట్టన పెట్టుకున్న నీచ చరిత్ర చంద్రబాబుదేనన్న అంశాన్ని మరువ రాదని పవన్ కళ్యాణ్‌కు హితవు పలికారు. సమావేశంలో కుంటిమద్ది రమేష్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ బాధ్యతారాహిత్యమే

- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్



మాట్లాడుతున్న రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా తిరుపతి దుర్ఘటన నిలిచిందని వైఎస్సార్‌సీపీ అనంతపురం టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ ధ్వజమెత్తారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ చైర్మన్, ఈఓ మధ్య.... ఈఓ, డిప్యూటీ ఈఓ మధ్య నెలకొన్న విభేదాలు స్వయంగా సీఎం చంద్రబాబు చేపట్టిన సమీక్షలో బహిర్గతం కావడం గమనార్హమన్నారు. దుర్ఘటనకు కారణమైన టీటీడీ చైర్మన్‌ను తొలగించి, టీటీడీ ఈఓ, డిప్యూటీ ఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పు జరిగిందంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పడాన్ని చూస్తుంటే ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడేది తానేనన్న పవన్‌కళ్యాణ్ ముక్తసరిగా క్షమాపణతో దాటవేసే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను అడ్డుకునేందుకు లారీలను అడ్డం పెట్టిన తీరును గమనిస్తే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడకుండా ఉండేందుకు చేసిన కుట్రగానే అర్థమవుతోందన్నారు. సమావేశంలో బెస్త వెంకటేష్, రాఘవ, రఫి, బాలాజీ, హిద్దూ, హేమకిరణ్, వంశీ, గణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటి విడుదల తగదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం అర్బన్: విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం జలాశయం నుంచి ఇష్టారాజ్యంగా నీటిని దిగువకు వదిలేయడం సరికాదని ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ హితవు పలికారు. శుక్రవారం అనంతపురంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం జలాశయానికి 1,622 టీఎంసీల వరద వచ్చి చేరినా... హంద్రీ-నీవా కింద సాగైన పంటలు పూర్తయ్యే వరకూ నీరు ఇచ్చే పరిస్థితి లేదంటూ తెలంగాణ ప్రభుత్వం విధించిన నిబంధనపై ఏపీ ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలన్నారు. శ్రీశైలం డ్యామ్ నుంచి ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి పేరుతో తెలంగాణ ప్రభుత్వం 358.84 టీఎంసీలు, ఏపీ ప్రభుత్వం 199.38 టీఎంసీల నీటిని పోటీ పడి దిగువకు వదిలేశాయన్నారు. హంద్రీ-నీవా కాలువ వెడల్పు, ప్రస్తుత పంటల రక్షణ అంశంపై హంద్రీ-నీవా సాగుదారులతో కలసి సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 19న కర్నూలులో సదస్సు ఉంటుందన్నారు. డిమాండ్ల సాధనకు 27న రాయలసీమ జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గోకులాలు పూర్తి చేయండి

- పశుశాఖ జేడీ వెంకటస్వామి



మాట్లాడుతున్న పశుశాఖ జేడీ వెంకటస్వామి

అనంతపురం అగ్రికల్చర్: నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) కింద మంజూరు చేసిన గోకులాల షెడ్ల నిర్మాణాలు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పశుశాఖ డీడీ కార్యాలయంలో అనంతపురం డివిజన్ డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, పశువ్యాధి నిర్ధారణకేంద్రం ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్రతో కలసి గోకులాల నిర్మాణాల అంశంపై ఏడీలు, డాక్టర్లతో ఆయన సమీక్షించారు. పాడి రైతులకు ఉపయోగపడేలా ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన గోకులాల షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణాలు మొదలుపెట్టని ప్రాంతాల్లో వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులోకి వచ్చాయని, ఈ నేపథ్యంలో పశువైద్య సేవలు మరింత మెరుగ్గా కొనసాగించాలన్నారు. బ్రూసెల్లోసిస్, డీవార్మింగ్, గాలికుంటు, పీపీఆర్ వ్యాధులకు సంబంధించి చేపట్టిన ఉచిత వ్యాక్సినేషన్ల కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. 31వ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని సాధ్యమైనంత తొందరంగా పూర్తి చేసి కచ్చితమైన గణాంకాలు సమర్పించాలని ఆదేశించారు. అంతకు ముందు పశుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

తప్పులు చేస్తే హెచ్‌ఎంలదే బాధ్యత

- విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: పోస్టులను నిలబెట్టుకోవడం కోసం బడుల్లో లేని పిల్లలను అటెండెన్స్‌లో చూపించొద్దని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో వెబెక్స్ నిర్వహించారు. అనంతపురం నగర శివారులోని ఆర్డీటీ స్కూల్ సమావేశ మందిరం నుంచి డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, ఎంఈఓలు, నూతన ప్రతిపాదిత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలోనూ మోడల్ ప్రాథమిక స్కూల్ ఏర్పాటుకు విధివిధానాలు పంపామన్నారు. ఆ మేరకు జిల్లాలో కసరత్తు చేసి పూర్తిస్థాయి జాబితా సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

రేషన్ పంపిణీలో డీలర్ల చేతివాటం



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రాప్తాడురూరల్: పేదలకు చౌకధాన్యపు డిపోల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని డీలర్లు అమ్ముకుంటున్నారని సీపీఎం నాయకులు మండిపడ్డారు. అర్హులైన పేదలందరికీ రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో స్టోర్‌లు ఎప్పుడు తెరుస్తారో, ఎన్నిగంటలు వేస్తారో తెలియడం లేదన్నారు. పేదలు తెల్లవారుజామున నుంచే రేషన్‌షాపుల వద్ద క్యూల్లో నిలబడుతున్నారన్నారు. ప్రతి స్టోర్ వద్ద నాలుగైదు రోజులకు మించి వేయడం లేదన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదని ఆరోపించారు. బియ్యం మాత్రమే కాకుండా పామాయిల్, పంచదార, కందిబేడలు తదితర సరుకులు కూడా పంపిణీ చేయాలన్నారు. శ్రీశ్రీ నగర్, మహదేవనగర్, కొడిమి పంచాయతీ ఆటో కాలనీ, జ్యోతిబసు కాలనీ, కక్కలపల్లి పంచాయతీ ప్రజాశక్తినగర్‌లో రేషన్‌షాపులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, నాయకులు ప్రకాష్, గోపాల్, వలి, మసూద్, ఇర్ఫాన్, బుల్లె రాజు, శ్రీనివాసులు, వెంకటేష్, జీవ తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలందించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలతో సహృదయంగా మాట్లాడడంతో పాటు సత్వర సేవలందించేలా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ నాల్గవ తరగతి ఉద్యోగులకు సూచించారు. ఆర్ ఏపీ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌పీరా, ఉపాధ్యక్షుడు ముక్తియార్, అసోసియేట్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కోశాధికారి వాజిద్ బాషా, సంయుక్త కార్యదర్శి షేక్షావలి, నాయకులు నాగభూషణం, కిరణ్ కుమార్, రఘువీరా, స్వర్ణలత, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

అనంతపురం అర్బన్: 'అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తాము. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రజలకు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు మీరు అధికారంలో వచ్చారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయండి.' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణానికి సిమెంట్, ఇసుక, ఇటుక, ఇనుపకడ్డీలు ఉచితంగా ఇవ్వాలన్నారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లుగా ఇంటి స్థలాలను మార్చాలన్నారు. సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, నాయకులు రాజారెడ్డి, శ్రీరాములు, చిన్నప్పయాదవ్, పద్మావతి, కేశవరెడ్డి, రాజేష్‌గౌడ్, లింగమయ్య, అల్లిపీరా పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో టీచర్ల పాత్ర కీలకం

అనంతపురం ఎడ్యుకేషన్: శాస్త్రీయ దృక్పథం కల్గిన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 'సెన్స్-చెకుముకి ఉపాధ్యాయులతో సమాలోచన' అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. గేయానంద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహించే పరీక్షల తర్వాత ఎక్కువమంది విద్యార్థులతో పరీక్షలు నిర్వహించేది జేవీవీ వేదిక అన్నారు. ఏటా 4 లక్షలకు పైగా విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటున్నారన్నారు. జేవీవీ గౌరవ అధ్యక్షులు గంగేనాయక్ అధ్యక్షతన జరిగిన సదస్సులో నాయకులు భాస్కర్, జిలాన్ బాషా, జిల్లా సమత కన్వీనర్ డాక్టర్ ప్రసూన, యూటీఎఫ్ సురేష్, జేవీవీ రామిరెడ్డి, ప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రేపు ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల మహాసభ

అనంతపురం క్రైం: నగరంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉన్న కళ్యాణ మండపంలో ఈనెల 12వ తేదీన ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ద్వితీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు రీజినల్ కార్యదర్శి ఎం.నాగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

'ఎరా'లో క్రీడా సంబరాలు

అనంతపురం రూరల్: ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని క్రీడా సంబరాలు జరిగాయి. సీఆర్ఐటీ విద్యా సంస్థల చైర్మన్ చిరంజీవి రెడ్డి, ఎరా స్కూల్ చైర్మన్ అరుణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

అనంతపురం: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించారు. గాలి పటాలను ఎగురవేసి సందడి చేశారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే సంస్కృతి సంప్రదాయాల గురించి తెలియజేయాల్సిన బాధ్యత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ మార్కండేయులు సూరి, అనంతలక్ష్మి పాఠశాల చైర్మన్ అనంత రాముడు, వైస్ చైర్మన్ ఎం.రమేష్ నాయుడు, సీఏఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: తపోవనంలోని వేదమాత గాయత్రిదేవి ఆలయంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవం, నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ జరిగింది. వచ్చే నెల 3న వసంత పంచమితో పాటూ ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన కార్యదర్శి రొద్దం అనంత్, నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత శ్రేణి వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ఘంటసాల భవన్ పాలసముద్రం నాగరాజు, ప్రముఖ హోమియో వైద్యులు యాదాటి రాంగోపాల్, ఆలయ అధ్యక్షులు ఎస్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ రాయితీ కోసం దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం రూరల్: సొంత వ్యాపారం, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తూ మూడు చక్రాల వాహనాలు కలిగిన దివ్యాంగులకు రాయితీతో పెట్రోల్ సరఫరా చేయనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ వినోద్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన వారు సదరం సర్టిఫికెట్, పెట్రోల్ బిల్లులు, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్, ఫొటోలు, వాహనం ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పని చేస్తున్న సంస్థ ధ్రువీకరణ పత్రాన్ని జతపరిచిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోపు అందజేయాలి. వివరాలకు 08554-232380లో సంప్రదించాలని సూచించారు.

మాతాశిశు మరణాలపై సమీక్ష

అనంతపురం మెడికల్: గత ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో జిల్లాలో చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై సంబంధిత వైద్యాధికారులతో డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి శుక్రవారం తన చాంబర్‌లో సమీక్షించారు. మాతాశిశు మరణాలను అరికట్టాలని ఆదేశించారు. ప్రతి గర్భిణికీ అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించాలన్నారు. ప్రమాదకర లక్షణాలు ఉన్న గర్భిణుల పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డీఎంఓ డాక్టర్ యుగంధర్, ప్రొఫెసర్ డాక్టర్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్‌గా మల్లికార్జున రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్‌గా మల్లికార్జున రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్ సెలవులో వెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్న మల్లికార్జున రెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. నగరపాలక సంస్థలో నూతన కమిషనర్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ఓలు లక్ష్మీదేవి, విజయ్‌కుమార్, ఆర్ఐ రఘునాథ్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు ఉదయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'ఆటశాల'పై జాతీయ సదస్సు

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామంలో శుక్రవారం అఖిల భారతీయ క్రీడాభివృద్ధి సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా 25 సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. జనరలిటాట్ వాలెన్సియానా సహకారంతో రెండు రోజుల పాటు ఆటశాల అనే జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. క్రీడల భాగస్వామ్యం, క్రీడల్లో బాలికలు, మహిళల నాయకత్వం, క్రీడల ద్వారా జీవిత నైపుణ్యాల విద్య కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 25 కంటే ఎక్కువ సంస్థలు, అభ్యాసకులు, విద్యావేత్తలు నిపుణులు ఆటశాల కార్యక్రమం ద్వారా చేపట్టే అంశాలపై ప్రసంగించడం అభినందనీయమన్నారు. శనివారం సదస్సు ముగియనుంది. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో భక్తుల వాగ్వాదం

అనంతపురం కల్చరల్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల రద్దీని సక్రమంగా నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారు. గురువారం అర్ధరాత్రి నుంచే నగరంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో వేలాది మంది బారులు తీరి స్వామి వారి దర్శనానికి పడిగాపులు కాచారు. అయితే పోలీసు ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులు, అధికార పార్టీ నాయకులు ఆలస్యంగా వచ్చినా వారిని దర్శనానికి అనుమతించడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల దేవదాయశాఖ అధికారులు కూడా పోలీసులతో వాగ్వాదం చేయడం కనిపించింది. మీడియా వారిని కూడా సక్రమంగా అనుమతించకుండా గంటల తరబడి ఆపేశారని జర్నలిస్టులు వాపోయారు.

బుద్ధిమాంద్యం పింఛన్ రూ.15 వేలు ఇవ్వాలి

అనంతపురం అర్బన్: బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న వారికి, కాళ్లు లేదా చేతులు కోల్పోయిన వారికి ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక భద్రత పింఛన్ రూ.15 వేలు ఇవ్వాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు కొడవండ్ల నరేష్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. రెండు కాళ్లు లేదా రెండు చేతులు కోల్పోయిన వారికి ఇస్తున్న రూ.6 వేల పింఛన్‌ను రూ.15 వేలకు పెంచాలన్నారు. రైతు కూలీ సంఘం పి.కృష్ణ, పట్టణ పేదల సంఘం వీరనారప్ప, ఎంఎస్‌పీ టీపీ రామన్న, ఏఐఎస్ఏ వేమన పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని న్యాయశాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన బి.వెంకటేశ్వర్లుకు శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీరాముల పర్యవేక్షణలో 'ల్యాండ్ అక్విజిషన్ ఇన్ ఇండియా' (విత్ స్పెషల్ రెఫరెన్స్ టు పేయిమెంట్ ఆఫ్ కంపెన్సేషన్ టు ల్యాండ్‌లార్డ్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్') అనే అంశంపై పరిశోధన చేశారు. న్యాయశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీరాములు పర్యవేక్షణలో తొలి డాక్టరేట్ కావడం విశేషం. ఈ అంశంపై పలు జర్నల్స్ ప్రచురించారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

అనంతపురం రూరల్: నగర ప్రజలకు వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని ఎఫ్‌కే తాజ్‌మహల్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు పక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం రుద్రంపేట బైపాస్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఢిల్లీ ఎర్రకోట, తాజ్‌మహల్ సెట్టింగులతో ఆకట్టుకునేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. అంకిత్, నిఖిల్, రెహమాన్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు


బహుమతులు అందజేస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: రెవెన్యూ ఉద్యోగుల సంఘం కలెక్టరేట్ యూనిట్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి గురువారం కలెక్టరేట్ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో కేఆర్‌ఆర్‌సీ, పీజీఆర్ఎస్, డీఎస్‌ఓ, సర్వే శాఖ, యూనియన్ బ్యాంకు మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమానికి డీఆర్‌ఓ ఎ.మలోల ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కేఆర్‌సీసీ తహసీల్దారు వాణిశ్రీ, టైపిస్ట్ ఆర్.రేఖ బృందం ప్రథమ బహుమతి, సర్వే శాఖ బృందం ద్వితీయ బహుమతి, యూనియన్ బ్యాంక్ బృందం తృతీయ బహుమతి సాధించారు. మిగిలిన వారి పార్టిసిపేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి భరత్‌కుమార్, కోశాధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్ రావు, సంయుక్త కార్యదర్శి అక్రం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు


తప్పిపోయిన బాలుడితో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

అనంతపురం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయాల వద్ద నిర్వహిస్తున్న పోలీసు బందోబస్తు, భద్రతను జిల్లా ఎస్పీ పి.జగదీష్ పర్యవేక్షించారు. నగరంలోని అతి పురాతనమైన చెన్నకేశవ దేవాలయం వద్ద బందోబస్తు, భక్తుల క్యూలైన్లను పరిశీలించారు. దర్శనం కోసం వచ్చి తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన మూడేళ్ల బాలుడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాలుడిని ఆ తల్లిదండ్రులకు అప్పగించారు.

చదువుల తల్లికి 'అమ్మ' చేయూత


ఆర్థిక చేయూతనందిస్తున్న అమ్మ రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ విద్యార్థిని చదువుకునేందుకు ఫీజు చెల్లించి అండగా నిలిచారు అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి. వివరాలు.. రాంనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటేశు, రమణమ్మ దంపతుల కుమార్తె గౌతమి డిగ్రీ చదువుతోంది. తండ్రి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న సమయంలో డయాబెటిస్ అధికమై ఒక కాలు తొలగించాల్సి వచ్చింది. జీవనోపాధి కోసం తల్లి నాలుగిళ్లలో పాచిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అనారోగ్యంతో మంచానికి పరిమితమైన భర్త వెంకటేశు వైద్య ఖర్చులు, కుమార్తె గౌతమి కాలేజీ ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి వెంటనే స్పందించారు. వెంకటేశు కృత్రిమ కాలికి అవసరమైన రూ.40 వేలు, గౌతమి తక్షణ ఫీజు రూ.20 వేలు, మరో సెమిస్టర్ ఫీజు కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో వెంకటేశు కుటుంబానికి అండగా ఉంటామని రమణారెడ్డి భరోసా ఇచ్చారు.

- మారిపోయిన రూపురేఖలు
- రెస్టారెంట్ల హబ్‌గా మారిన హైదరాబాద్–బెంగళూరు హైవే
- అందుబాటులో బ్రాండెడ్ షోరూంలు, జ్యువెలరీ షాపులు

చారిత్రక నగరం... అందరికీ అనుకూలం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరం రూపురేఖలు మారిపోయాయి. ప్రధాన నగరాలకు ధీటుగా విస్తరిస్తోంది. పదేళ్ల క్రితం వరకు సాధారణ అర్బన్ ప్రాంతం మాత్రమే. పేరుకు నగరం అయినప్పటికీ మిగిలిన పట్టణాల తరహాలోనే అరకొర సౌకర్యాలతో ఉండేది. నగరాల్లోని జీవనశైలి, వసతులు, సంస్థలు వంటివి పెద్దగా కన్పించేవి కాదు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మెట్రోపాలిటన్ నగర స్వరూపాన్ని తలపించేలా అనంతపురం జిల్లా కేంద్రం రూపుదిద్దుకుంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ కు పెట్టింది పేరుగా నిలిచిన అనంతకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అందుకు భిన్నంగా నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడుతున్నారు.


అనంతపురం నగరానికి తలమానికంగా నిలుస్తున్న టవర్‌క్లాక్

అందరికీ ఆమోద యోగ్యం

వాతావరణ, భౌగోళిక అనుకూలతలు అనంతపురం నగర విస్తరణకు దోహదపడుతున్నాయి. ఏ ప్రాంతం వారైనా సులువుగా ఇమిడిపోయేలా ఇక్కడి వాతావరణం ఉంటుంది. మరీ వేడిగానూ ఉండదు. అలాగనీ మరీ చల్లగానూ ఉండదు. ఇక భౌగోళిక పరంగా చూస్తే ఇటు బెంగళూరు, అటు కర్నూలు, హైదరాబాద్ నగరాలతో చక్కటి కనెక్టివిటీ ఉంది. రవాణాకు అత్యంత ప్రధానమైన జాతీయ రహదారి–44 కూడా నగరం మీదుగానే వెళ్తోంది.

విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్..

రియల్ ఎస్టేట్ రంగం ఓ వైపు విస్తరించడం, గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు, ప్రజలు అనంతపురం నగరంలో స్థిరపడుతున్నారంటే ఇక్కడ లభిస్తున్న ఉపాధి అవకాశాలని చెప్పాలి. అదేవిధంగా గతంలో పోల్చితే అనంతపురం నగరంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. వైఎస్సార్ హయాంలో చేపట్టిన చర్యల వల్ల మరో 40 ఏళ్ల పాటు తాగునీటి సమస్య ఉండదు. పీఏబీఆర్ డ్యాం తాగునీటి పైప్‌లైన్ పథకం ద్వారా నగరవాసులకు తాగునీటికి ఢోకా లేదు.

నలుదిశలా అభివృద్ధి..

అనంతపురం నగరం నలువైపులా విస్తరిస్తోంది. నగర పాలక సంస్థ వాస్తవ పరిధి 16.35 చదరపు కిలోమీటర్లు అయినప్పటికీ పలు రూరల్ ప్రాంతాలు కూడా నగరంలో అంతర్భాగంగా అభివృద్ధి చెందుతున్నాయి. తూర్పున బుక్కరాయ సముద్రం, ఎస్కేయూ, పడమర కక్కలపల్లి, కురుగుంట, ఉత్తరాన పాములూరు, దక్షిణాన రాప్తాడు వరకు నగరం విస్తరిస్తోంది. గతంలో నగరంలో చాలా తక్కువ సంఖ్యలో అపార్ట్‌మెంట్లు ఉండేవి. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా అపార్ట్‌మెంట్లు, విల్లాలు దర్శనమిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టవర్‌క్లాక్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్, గుత్తి రోడ్డు, రుద్రంపేట రోడ్డు, జేఎన్‌టీయూ, రాజీవ్ కాలనీ రోడ్డు ఇలా నగరం నలువైపులా అభివృద్ధి జరిగింది. గతంలో ఉపాధి కోసం ప్రజలు కేరళ, హైదరాబాద్, కర్ణాటక తదితర ప్రాంతాలకు వెళ్లే వారు. ఇప్పుడు అనంతపురానికే కేరళ, బీహార్, యూపీ, తదితర ప్రాంతాల నుంచి వచ్చి ఉపాధి పొందుతున్నారు. అదేవిధంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మార్ట్‌లు, సూపర్ మార్కెట్లు, అధిక సంఖ్యలో ఏర్పాటయ్యాయి. బ్రాండెడ్ షోరూంలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన జ్యువెలరీ షాపులు అనంతలో భారీగా ఏర్పాటయ్యాయి. మోటార్ రంగానికి సంబంధించి ద్విచక్ర, ఫోర్ వీలర్, తదితర షోరూంలు పెద్ద ఎత్తున అనంతపురంలో వెలిశాయి.

అనంతపురం 1799లో దత్త మండలానికి (రాయలసీమతో కూడిన బళ్లారి) కేంద్రంగా ఉండేది. అనంతపురానికి సర్ థామస్ మన్రో మొదటి కలెక్టరు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటీషు భారత సైన్యానికి అనంతపురం వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన కేంద్రం. ఇప్పటి జేఎన్‌టీయూ ప్రాంగణాన్ని అప్పట్లో ఆయుధ బంకరుగా వాడేవారు. అతిథ్య రంగం కూడా శరవేగంగా వృద్ధి చెందుతోంది. త్రీస్టార్ మొదలుకుని అన్ని వర్గాల ప్రజలకు అనువైన హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ఇక పర్యాటకంగానూ నగరానికి గుర్తింపు లభిస్తోంది. ఇక్కడి రథం ఆకారంలో గల ఇస్కాన్ దేవాలయం ప్రముఖ పర్యాటక ఆకర్షణ.




సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి


ఎస్కే యూనివర్సిటీ

విద్యార్థుల భవితకు పెట్టింది పేరు

ఒకప్పుడు అనంతపురంలో విద్యనభ్యసించడానికి స్థానికులు కూడా ఆసక్తి చూపే వారు కాదు. ప్రభుత్వ వైద్య కళాశాల, ఎస్కేయూ, జేఎన్‌టీయూ, తదితర ప్రాంతాల్లో నాణ్యత ప్రమాణాలు పెరగడంతో ఇక్కడ విద్యనభ్యసించేందుకు విద్యార్థులు తెగ ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు ఇంజినీరింగ్, నర్సింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయి.

మెట్రో జీవనశైలి..

మెట్రో తరహాలో అనంతపురం నగర ప్రజల జీవన శైలి ఉంటోంది. ప్రధానంగా ఆహార సంస్కృతి (ఫుడ్ కల్చర్) విపరీతంగా వృద్ధి చెందుతోంది. రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్నాయి. హైదరాబాద్–బెంగళూరు హైవే రెస్టారెంట్ల హబ్‌గా మారిపోయింది. అరేబియన్, హైదరాబాదీ వంటకాలు మొదలుకుని కేఎఫ్‌సీ చికెన్ వరకు ప్రతి ఆహారం లభిస్తోంది.